www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
08.10.2026



- రద్దీకి తగ్గట్లుగా భారీ ఏర్పాట్లు
- జిల్లాల వారీగా ప్రత్యేక సర్వీసులు
- 30 మంది ఉంటే ఇంటి వద్దకే బస్సు
- ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టికెట్ ధరలు


4లో..



దసరాకు 7,000ల ప్రత్యేక బస్సులు

దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. కనీసం 30 మంది ఉంటే కాలనీల వద్దకే వచ్చి పికప్ చేసుకునే వెసులు బాటుతో పాటు, జోన్ల వారీగా కేటాయించిన ప్రత్యేక సర్వీసుల వివరాలను సంస్థ వెల్లడించింది. ఆ వివరాల్లోకి వెళ్తే..

కలంజ్యోతి, హైదరాబాద్



పేదల ఇళ్లపై..

3లో..

బల్దియా పంజా!

హైదరాబాద్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న 'హైడ్రా' తరహా కూల్చివేతలు వరంగల్ నగరానికీ తాకాయి. భద్రకాళి ఆలయ సమీపంలోని చెరబండ రాజు కాలనీలో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదల గుడిసెలను అధికారులు అర్ధరాత్రి వేళ జేసీబీలతో నేలమట్టం చేశారు. కనీసం సామగ్రి సర్దుకునే సమయం కూడా ఇవ్వకపోవడంతో వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో వీధిన పడ్డాయి. అండగా నిలిచేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులను ముందస్తుగా గృహనిర్బంధం చేయడం, వేడుకున్న మహిళలను బలవంతంగా తరలించడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

- కలంజ్యోతి, వరంగల్

- రెండు డీఏల విడుదలకు ఉత్తర్వులు
- మొత్తం 6.37 శాతం పెంపు
- జీపీఎఫ్ ఖాతాల్లోకి బకాయిల జమ
- ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం

ఉద్యోగులకు ప్రభుత్వం దసరా కానుక

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 07) : దసరా పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగులకు మొత్తం 6.37 శాతం డీఏ పెరిగినట్లయింది. ఈ పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. నవంబరు 1వ తేదీన ఉద్యోగుల ఖాతాల్లో ఈ మొత్తం జమ కానుంది.

జీపీఎఫ్ ఖాతాల్లోకి బకాయిల జమ..

2024 జనవరి నుంచి 2026

మిగతా 2లో..

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
గురువారం 08.10.2026
2
www.kalamjyothi.com

దివ్యాంగులకు తీరని 'సదరం' సమస్యలు

పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

సరైన పరీక్షలు లేక అనర్హత వేటు



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 07) : నిర్మల్ జిల్లాలో వికలాంగులకోసం నిర్దేశించిన సదరం సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్ళుగా కొందరికి తాత్కాలిక సదరం సర్టిఫికెట్లు జారీ చేశారు. మరి కొంత మంది అర్హతలు ఉన్నా సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండా అనర్హత వేటు వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరం సర్టిఫికెట్ అనేది అనేది దివ్యాంగులకు (వికలాంగులకు) ప్రభుత్వ పరంగా లభించే పెన్షన్లు, రిజర్వేషన్లు, ఇతర రాయితీలను పొందడానికి అత్యంత కీలకమైన ధ్రువీకరణ పత్రం. సదరం ధ్రువీకరణలో వైకల్యం తీవ్రత, శారీరక పరిస్థితి, సంబంధిత వైద్య ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి అర్హత మేరకు శాతం నిర్ణయించాల్సి ఉంటుంది. కనీసం 40 శాతానికి మించి వైకల్యం ఉంటే ఈ సర్టిఫికెట్ వస్తుంది. పుట్టుకతో దివ్యాంగులు ఐతే వారికి సదరం సర్టిఫికెట్ ఎలాంటి అర్హతలు చూడకుండా ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం 21 వైకల్యాలను ఇందులోకి చేర్చారు. అయితే కొంతమంది దివ్యాంగులకు తగిన పరీక్షలు నిర్వహించకుండానే తక్కువ శాతం వైకల్యం నమోదు చేసి అనర్హత వేటు వేయడంతో తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని బాధితులు చెబుతున్నారు.

సరెండర్ అప్షన్‌తో కొత్త సమస్యలు..

గతంలో జారీ చేసిన సదరం ఫలితాల్లో వైకల్యం పెరిగిందని భావించిన వారు కాని, తమ వైద్య పరిస్థితికి అనుగుణంగా పునఃపరిశీలన అవసరమని భావించిన వారికి సరెండర్ చేసుకునే అవకాశం మీ సేవ ద్వారా అందుబాటులో ఉంది. దీంతో పలువురు దివ్యాంగులు గతంలో వచ్చిన తక్కువ శాతం సదరం ఫలితాలను సరెండర్ చేసి, తిరిగి వైద్య పరీక్షలకు అవకాశం వస్తుందని ఆశతో దరఖాస్తు చేసుకున్నారు.

అయితే సరెండర్ అనంతరం సంబంధిత వైద్య అధికారులు త్వరితగతిన పరిశీలించి, అవసరమైన పరీక్షలు జరపడం కానీ, తదుపరి సదరం క్యాంపు ప్రక్రియకు అనుసంధానం చేయటం కానీ జరగాలి. ఐతే నిర్మల్ జిల్లాలో ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు.

కొత్త ఆపరేటర్‌తో మరింత గందరగోళం..

ఇటీవల నిర్మల్‌లో సదరం/సంబంధిత ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించే కొత్త ఆపరేటర్ రావడంతో, వ్యవస్థపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల దివ్యాంగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణలు ఉన్నాయి. సరెండర్ చేసిన దరఖాస్తుల స్థితి, తదుపరి క్యాంపు వివరాలు, పునఃపరీక్ష ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందక పోవడంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. 4 సంవత్సరాలుగా పెన్షన్ దరఖాస్తులకు సంబంధించిన అవకాశాలు లేకపోవడంతో చాలామంది దివ్యాంగులు ఎదురుచూశారు. ఇటీవల పెన్షన్ దరఖాస్తులకు అవకాశం వచ్చింది. దీంతో అర్హత ఉన్నప్పటికీ గతంలో సదరం ఫలితాల్లో సమస్యలు ఎదుర్కొన్న పలువురు దివ్యాంగులు తమ సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో సదరం సరెండర్ చేసుకుని పునఃపరీక్ష కోసం ముందుకు వచ్చారు. అయితే పెన్షన్ దరఖాస్తుల గడువు సమీపిస్తున్న సమయంలో సదరం ప్రక్రియలో జాప్యం జరగడంతో అర్హులైన దివ్యాంగులు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌహన్ మోహన్ నిర్మల్ మండలం

సమస్యలు పరిష్కరించాలి

- ఇసాక్ అలీ



ఈ సమస్యలపై నిర్మల్ జిల్లా స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాఖ్ అలీ మాట్లాడుతూ పలుమార్లు ప్రజా ఫిర్యాదు విభాగంలో ఫిర్యాదులు చేసినప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. పలు ప్రయోజనాలతో ముడిపడి ఉన్న సదరం సర్టిఫికెట్ కోసం జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సదరం పరిష్కార శిబిరం నిర్వహించాలని డిమాండ్ చేసారు. సరెండర్ చేసిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, అర్హులైన వారికి వీలైనంత త్వరగా పునఃపరీక్షకు అవకాశం కల్పించాలని కోరారు.



రాణాపూర్ కు చెందిన వ్యక్తి. ఇతనికి పుట్టుకతో పోలియో వైకల్యం ఉంది. ఇతనికి కూడా శాశ్వత సదరం సర్టిఫికెట్ ఇంతవరకు ఇవ్వలేదు.

ఉద్యోగులకు ప్రభుత్వం దసరా కానుక

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేయనున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం..

ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా వేస్తున్నారు. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



పత్తిసాగులో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 07) : ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో అమీనాబాద్‌లో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి సాగులో సమీకృత పురుగు నివారణ, పంట రక్షణ, నాణ్యత పెంపు, కోత అనంతర నిర్వహణ, సహజ వనరుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా పురుగులు, తెగుళ్లను నియంత్రించి నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని నిర్వాహకులు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ సిబ్బంది తిరుపతి, రమేష్, సంతోష్, ఈర్య, రాజు, గణేష్, కుమారస్వామి, సందీప్, శివరాజ్, శృతి, ప్రియాంకతో పాటు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కరెంటు కోసం రైతన్నల ఆందోళన

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 07) : వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ హత్నూర మండలంలోని వడ్డేపల్లి, సిరిపురం సబ్ స్టేషన్ల వద్ద చింతలచెరువు, తెల్లరాళ్ల తండా గ్రామాల రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటలకు ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్తులో లోవోల్టేజీ సమస్యలతో బోరు మోటార్లు తరచుగా కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోవోల్టేజ్ విద్యుత్ సరఫరా వల్ల మోటార్లు కాలిపోయి తీవ్రంగా ఆర్థిక నష్టం వాటిల్లుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఒకవైపు వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందని, అయితే క్షేత్రస్థాయిలో కేవలం మూడు నాలుగు గంటల విద్యుత్తు మాత్రమే వస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఏనాడూ ఇంతటి దుస్థితి ఎదురుకాలేదని, పంట సాగు చేసిన నాటి నుంచే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలచెరువు, వడ్డేపల్లి, తెల్లరాళ్ల తండా, కోనంపేట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం హెచ్ఎం సస్పెన్షన్

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 07) : నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి స్వప్నను విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్న ఆరోపణలపై కలెక్టర్ భవిష్ మిశ్రా సస్పెన్షన్ వేటు వేశారు విపరాలు ఇలా ఉన్నాయి పాఠశాలలో రెండో తరగతి రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల సమయం ముగిసిన అనంతరం తరగతి గదిలోనే ఉండిపోగా, గది తాళం వేసి స్కావెంజర్, ప్రధానోపాధ్యాయులు స్వప్న ఇంటికి వెళ్లి పోయారు ఈ ఘటన వెలుగు చూడడంతో ఆగ్రహించిన కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఘటనపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన పాఠశాల స్కావెంజర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



ఘనంగా ఉపసర్పంచ్ బాలకిషన్ జన్మదిన వేడుకలు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 07) : అనంతగిరి గ్రామ ఉపసర్పంచ్ బాలకిషన్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మండల ఉపసర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాలకిషన్‌కు సర్పంచులు, ఉపసర్పంచులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎలుక రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులు శేఖర్ రెడ్డి, నవీన్ రెడ్డి, జుట్టు శేఖర్, నాగరాజు, ఉపసర్పంచులు గడ్డమిది పద్మ, అన్నాడి మహేందర్ రెడ్డి, అవినాష్, రమేష్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
గురువారం 08.10.2026
www.kalamjyothi.com



యాదవ సంఘం నూతన..

కార్యవర్గానికి ఘన సన్మానం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 07) : మండలంలోని కందికట్కూరు గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన శ్రీకృష్ణ గోపాల మండల యాదవ సంఘం కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరుపుల రాములు మాట్లాడుతూ గ్రామాల్లో యాదవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. యాదవ సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల యాదవ బంధువులు ఐక్యంగా ఉండి సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బాలరాజు, కార్యదర్శి అజయ్, కోశాధికారి రాజశేఖర్, కందికట్కూరు యాదవ సంఘం అధ్యక్షులు నక్క వెంకటి, ఉపాధ్యక్షులు నక్క బలయ్య, క్యాషియర్ నక్క మల్లేశం, ఉపసర్పంచ్ దోమ్మాటి అజయ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాస తిరుపతి, మాజీ ఎంపీటీసీ కిషోర్, యాదవ సంఘం సభ్యులు నక్క లింగం, నక్క శ్రీనివాస్, జక్కుల దేవయ్య, పసుల మల్లయ్య, నక్క మహేష్ తదితరులు, మహిళలు పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 07) : ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కృష్ణ మూర్తి కుమార్తె శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన తన సతీమణి మాధవి, కుమార్తె శ్రీనిధితో కలిసి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను వారికి అందజేయగా, శ్రీనిధి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు స్వామివారి ఆశీస్సులు పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడు మృతి

కలంజ్యోతి నెక్కొండ (అక్టోబర్ 07) : నెక్కొండ మండలంలోని పిట్టకాలుబోడు తండా గ్రామంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. విద్యోదయ హై స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొనడంతో రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టకాలు బోడు తండాకు చెందిన బాదావత్ రమేష్-అఖిల దంపతుల కుమారుడు బాదావత్ రాహుల్ (2) ఉదయం సుమారు 9 గంటల సమయంలో తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న విద్యోదయ హై స్కూల్ బస్సు బాలుడిని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాహుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, తండావాసులు బోరున విలపించారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్ నరేష్, క్లీనర్ సంఘటన స్థలం నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన తండావాసులు బస్సును అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గిరిజన గళం నుంచి వెండితెరకు ఎంట్రీ

- 20 ఏళ్ల పోరాటానికి వెండితెర గుర్తింపు
- భారీ గిరిజన చిత్రంలో మద్దిశెట్టి సామేలు





కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (అక్టోబర్ 07) : ఏజెన్సీ గడ్డపై ఆదివాసీల హక్కుల కోసం, గిరిజన బహుజనుల ఆత్మగౌరవం కోసం గత 20 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న ప్రజానాయకుడు, ఎన్సీపీ పార్టీ, ఎన్డీఏ మహాకూటమి, ఎన్నెసీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు మద్దిశెట్టి సామేలు జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇన్నాళ్లూ ప్రజల కోసం పోరాటం చేసిన మద్దిశెట్టి సామేలు, ఇప్పుడు వెండితెరపై అడుగుపెడుతున్నారు. ఆదివాసీల నిజ జీవితాన్ని, వారి కష్టాలను, పోరాటాలను యథాతథంగా చూపించేందుకు ప్రముఖ దర్శక నిర్మాత జితేంద్ర యాదగిరి మరియు 370కి పైగా చిత్రాల్లో నటించి 'రియల్ స్టార్', 'రియల్ హీరో'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న అప్సర్ ఆజాద్ సంయుక్తంగా ఓ భారీ గిరిజన చిత్రాన్ని నిర్మించబోతున్నారు.

హైదరాబాద్‌లో సినిమా డైరెక్టర్‌తో ఆత్మీయ భేటీ..

హైదరాబాద్‌లోని సినిమా డైరెక్టర్ కార్యాలయంలో మద్దిశెట్టి సామేలు దర్శక నిర్మాతలను కలిశారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలును శాలువాతో, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సినిమా కథను డైరెక్టర్ జితేంద్ర యాదగిరి, అప్సర్ ఆజాద్, మద్దిశెట్టి సామేలు కలిసి చర్చించారు.

అన్నదమ్ముల అనుబంధమే ప్రాణం..

ఈ చిత్రంలో అన్నదమ్ముల అనుబంధమే ప్రధాన కథాంశం కానుంది. ఇందులో సీనియర్ నటుడు, రియల్ హీరో అప్సర్ ఆజాద్ అన్నయ్య పాత్రలో నటిస్తుండగా, మద్దిశెట్టి సామేలు తమ్ముడి పాత్రలో నటిస్తున్నారు ఇద్దరు హీరోలుగా సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయనున్నారు. అన్న అడవిని, తమ్ముడు హక్కులను కాపాడటం కోసం చేసే పోరాటమే ఈ చిత్ర కథ.

భద్రాచలం నుంచి అరకు దాకా..

ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల మొదటి వారంలో ఘనంగా ప్రారంభం కానుంది. కథలో సహజత్వం కోసం, ఆదివాసీ సంస్కృతిని అద్భుతంగా చూపించడం కోసం షూటింగ్ మొత్తం ఏజెన్సీ అడవుల్లోనే చేయాలని దర్శకుడు జితేంద్ర యాదగిరి నిర్ణయించారు. ముఖ్యంగా పవిత్ర పుణ్యక్షేత్రాలైన భద్రాచలం, మారేడుమిల్లి అడవులు, అరకులోయ, మేడారం సమ్మక్కసారలమ్మ జాతర ప్రాంగణం, గుబ్బల మంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఇన్నేళ్లుగా ప్రజల మనిషిగా ఉన్న సామేలు ఇప్పుడు వెండితెరపై కూడా తమ గోడును వినిపిస్తారని, గిరిజన బిడ్డలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తారని ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిన్నారికి సిద్ధన రమేష్ ఆశీర్వాదం

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 07) : చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కూస కర్ణాకర్-రమ్య దంపతుల కుమార్తె మౌనశ్రీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ హాజరై చిన్నారి మౌనశ్రీని ఆశీర్వదించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చైతన్యరెడ్డి, సర్పంచ్ గూడ సంధ్య-మహేందర్, సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్యగౌడ్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బండి హరీష్, మాజీ ఎంపీటీసీ ఉప్పుల దేవేందర్, సొసైటీ డైరెక్టర్ పెంతల రమారాజు, పెండ్లి ఐలయ్య, వార్డు సభ్యులు పెండ్లి మల్లయ్య, పెండ్లి రాజేందర్, కూస రాజశేఖర్, గూడ రమణారెడ్డి, రవి, చెంచు నాగరాజు, చెవ్వ యాదగిరి, మేడిద అశోక్, అనుముల సుకన్యతో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరుస మోటార్ చోరీలు

కలంజ్యోతి, చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో వరుస మోటార్ చోరీలు కలకలం రేపుతున్నాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే మూడు ప్రాంతాల్లో బోర్ మోటార్లు చోరీకి గురికావడంతో గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా కోనాపురం గ్రామ స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌తో పాటు విద్యుత్ వైర్, పైపును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని గ్రామ సర్పంచ్ మైదం రాకేష్ తెలిపారు. గతంలో పెద్దమ్మతల్లి ఆలయంలో సుమారు రూ.15 వేల విలువైన మోటార్‌తో పాటు ఆలయ గంట చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం బీరన్న ఆలయంలో సుమారు రూ.10 వేల విలువైన మోటార్ అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. ఈ వరుస చోరీల నేపథ్యంలో గ్రామంలో రాత్రివేళ గస్తీ పెంచడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 08.10.2026
www.kalamjyothi.com

దసరాకు 7,000ల ప్రత్యేక బస్సులు

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 07) : దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గమ్యస్థానాలకు చేర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు.

జిల్లాల వారీగా ప్రత్యేక సర్వీసులు..

రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసులను అందుబాటులో ఉంచారు. కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.





30 మంది ఉంటే ఇంటి వద్దకే బస్సు..

ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సదుపాయాన్ని అమల్లోకి తెచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే, నేరుగా వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. బస్టాండ్లకు వెళ్లే శ్రమ లేకుండా నేరుగా కాలనీల నుంచే ప్రయాణించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి మోసపోకుండా, క్షేమంగా స్వస్థలాలకు చేరేందుకు ఆర్టీసీ కల్పించిన ఈ ప్రత్యేక రవాణా సేవలను వినియోగించుకోవాలని సంస్థ అధికారులు కోరారు.

దేశ ప్రజలు బీజేపీని క్షమించరు

కలంజ్యోతి, న్యూఢిల్లీ (అక్టోబర్ 07) : కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ ప్రభుత్వం తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున కుట్ర పన్నారని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును ఈసీ నిర్దాక్షిణ్యంగా కొల్లగొడుతోందని ఆరోపించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాహుల్‌గాంధీ ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారును దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు. దేశంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు. నిబంధనల సాకుతో అన్యాయంగా జాబితా నుంచి తొలగించిన ఓట్లన్నింటినీ తిరిగి చేర్చాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించే వరకు ప్రభుత్వపరంగా, పార్టీపరంగా న్యాయపోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. పేదలు, బలహీన వర్గాల ఓట్లను తొలగించి లబ్ధి పొందాలని చూస్తున్న కేంద్ర పాలకుల కుయుక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ సాగనివ్వబోమని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నిష్పక్షపాతంగా వ్యవహరించని ఆయనతో కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయించాలని, లేనిపక్షంలో కేంద్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న పాలకులే త్వరలో గద్దె దిగిపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదల ఇళ్లపై.. బుల్డియా దండు

- వరంగల్‌లో అర్ధరాత్రి బుల్డోజర్ల బీభత్సం
- పేదల గుడిసెలు నేలమట్టం
- భద్రకాళి పరిసరాల్లో ఇళ్ల కూల్చివేతలు
- కన్నీరుమున్నీరైన బాధితులు..
- పోలీసులతో తీవ్ర వాగ్వాదం
- మాజీ ఎమ్మెల్యే దాస్యం గృహనిర్బంధం
- నడిరోడ్డున పడ్డ వందలాది కుటుంబాలు



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 07) : వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధి లోని భద్రకాళి పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరబండ రాజు కాలనీలో భారీ పోలీస్ బందోబస్తు మధ్యకూ ల్చివేతలు జరిగాయి. ఎలాంటి ముందస్తు నోటీ సులు లేకుండా అర్ధరాత్రి వేళ బలగాలను రంగం లోకి దింపి గుడిసెలను తొలగించడంతో కాలనీ వాసులు భయాందోళనలకు గురయ్యారు. నిద్ర పోతున్న వేళ అధికారులు జేసీబీలతో ఇళ్లను ధ్వం సం చేయడంతో చెరబండ రాజు కాలనీ ఆర్తనాదాలతో దద్దరిల్లింది. దశాబ్దాలుగా ఇక్కడే రేకుల షెడ్లలో జీవిస్తున్నామని, సామగ్రిని తీసుకునే వ్యవ ధి కూడా ఇవ్వకుండా అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించారని బాధితులు రోదించారు.

పోలీసులతో స్థానికుల ప్రతిఘటన..

కూల్చివేతలను అడ్డుకునేందుకు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి జేసీబీలకు అడ్డంగా నిలిచారు. తమ గూడును కూల్చవద్దంటూ అధికారుల కాళ్లపై పడి వేడుకున్నారు. ఈ క్రమంలో మట్టెవాడ పోలీసులతో కాలనీవాసులకు మధ్య తోపులాట, తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిఘటించిన మహిళలు, బాధితులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన బాధితుల కుటుంబసభ్యులు స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.







మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హౌస్ అరెస్ట్

బాధితులకు మద్దతుగా వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి, ఉన్న గుడిసెలను అర్ధరాత్రి కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. అధికార యంత్రాంగం చర్యలతో వందలాది నిరుపేద కుటుంబాలు నిలువ నీడ లేక రోడ్డున పడ్డాయి. పెద్దల ఆక్రమణలను వదిలేసి, పొట్టకూటి కోసం వచ్చిన పేదలపై ప్రతాపం చూపడం దారుణమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణమే ప్రత్యామ్నాయ నివాసాలు చూపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

మేకర్స్ నన్ను సరిగ్గా గుర్తించలేదు



మంచి కథలు వస్తే వరుస సినిమాలు చేస్తా పరిశ్రమలో మేకర్స్ తనను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్లే ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదని నటి శ్రీనిధి శెట్టి పేర్కొంది. ప్రస్తుతం వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న ఆదర్శ కుటుంబం చిత్రంలో నటిస్తున్న ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. తాను సెలెక్టివ్‌గా ఉంటూ సినిమాలు తగ్గించానని అందరూ అనుకుంటున్నారని, కానీ మంచి కథ, సరైన టీమ్ కుదిరితే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా సిద్ధమేనని తెలిపింది. కొన్నిసార్లు పరిస్థితులు కలిసిరాకపోవడం, సరైన గుర్తింపు దక్కకపోవడం వల్లే అవకాశాలు రాలేదని, సినిమాపై ఉన్న ఇష్టంతోనే తాను ముందుకు సాగుతున్నానని శ్రీనిధి శెట్టి స్పష్టం చేసింది.